క్లుప్తంగా

స్కూల్ నూతన భవనం ప్రారంభం



భవానీపురం(విజయవాడపశ్చిమ): జక్కంపూడి వైఎస్సార్‌కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీరాకేష్ పబ్లిక్ స్కూల్ భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకాకేష్ ఈఎం యూపీ స్కూల్ బోర్డ్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణా విశ్వవిద్యాలయం రెక్టార్ మండవ బసవేశ్వరరావు మొదటి అంతస్తును, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ హెడ్ రామినేని శివరాం ప్రసాద్ స్కూల్ ఆఫీస్‌ను ప్రారంభించారు. అలాగే ప్రముఖ పర్యావరణవేత్త అనుమోలు గాంధీ లాంగ్వేజ్ ల్యాబ్‌ను, అమెరికాకు చెందిన వెల్త్ ఫర్ గో బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్ భోగవల్లి ఉదయ్ కిరణ్ రెండవ అంతస్తును ప్రారంభించారు.

దాసాంజనేయుడికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం దాసాంజనేయస్వామి వారి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన సింధూరం, ఆకు పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇంటర్మీడియెట్ ఫలితాలు వచ్చిన నేపథ్యంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఆలయానికి చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వాహణాధికారి పి.లోకేశ్వరి పర్యవేక్షించారు.

ఉత్తమ విద్యార్థులకు అభినందన



భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం అరవింద వీధిలోని బెజవాడ రాజారావు హైస్కూల్‌లో చదివిన విద్యార్థులు సీనియర్ ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించినందుకు ఆ స్కూల్ కరస్పాండెంట్ బెజవాడ రాజారావు అభినందించి బహుమతులు అందజేశారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో పూర్వ విద్యార్థులు గోళ్ల బేబి శ్రీవైష్ణవి(979), ఎం. లోకేష్ సాగర్ (971), షేక్ సుహాన(964), డి. కనిష్క (959)లు ఇంటర్‌మీడియెట్‌లో ఉత్తమ మార్కులు సాధించారన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ శ్యామ్ ప్రకాష్, ప్రిన్సిపాల్ కేపీఎల్ ప్రసన్న పాల్గొని విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

ఉద్యోగం పేరిట మహిళకు టోపి

పాయకాపురం(విజయవాడరూరల్): సైబర్ నేరాలపై పోలీసు శాఖ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ నేరగాళ్లు అమాయక ప్రజలను మోసం చేస్తూనే ఉన్నారు. నున్న పోలీసు స్టేషన్ పరిధి కండ్రికకు చెందిన మాకం రాణి అనే మహిళ పార్ట్ టైమ్ జాబ్ ఆశతో ఇన్‌స్టాగ్రాం మెస్సేజ్ చూసి మోసపోయారు. పోలీసుల వివరాల ప్రకారం.. కండ్రిక కొండాలమ్మ గుడి దగ్గర నివాసం ఉంటున్న ఫిర్యాది రాణి ఈనెల 9వ తేదీన సైబర్ నేరగాళ్ల మొబైల్ నుంచి వచ్చిన మెస్సేజ్‌కు స్పందించారు. పార్ట్ టైమ్ జాబ్ కోసం ఆకర్షితురాలైన ఫిర్యాది మార్కెటింగ్ చేసేందుకు ముందుగా రూ.1000, పిమ్మట రూ.2 వేలు, టాస్క్ పూర్తి చేయడానికి రూ.12 వేలు, 3వ టాస్క్‌కి రూ.30 వేలు చొప్పున ప్రైవేటు బ్యాంకు ఖాతాకు పంపాలని మెస్సేజ్‌లు పెట్టి డబ్బులు కాజేశారు. చివరికి మీరు ఇచ్చిన టాస్క్ తప్పుగా చేశారు.. మీ అక్కౌంటు ఫ్రీజ్ అయ్యిందని అన్‌ఫ్రీజ్ చేయడానికి మరో రూ.50 వేలు కట్టమని చెప్పడంతో అనుమానం వచ్చిన ఫిర్యాది నున్న పోలీసు స్టేషన్లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

20న రాష్ట్ర స్థాయి ఆరోగ్య సదస్సు

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ, రాష్ట్ర ఆరోగ్య బడ్జెట్-విశ్లేషణ అనే అంశాలపై ఈ నెల 20వ తేదీన ఉదయం 10 గంటలకు గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో జరిగే రాష్ట్ర స్థాయి ఆరోగ్య సదస్సును జయప్రదం చేయాలని ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ కె.వి.ఎస్.సాయిప్రసాద్ పిలుపునిచ్చారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయిప్రసాద్ మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. మన దేశంలో ప్రభుత్వ వైద్య రంగం రోజురోజుకు దిగజారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కొత్తగా రానున్న పది ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటైజేషన్ చేయడం దారుణమన్నారు. ప్రజా ఆరోగ్య వేదిక ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ ఆరోగ్యం ప్రతి ఒక్కరి హక్కు అని, అందుకు రాజస్థాన్ తరహాలో రైట్ టూ హెల్త్ యాక్ట్‌ను రాష్ట్రంలో కూడా తీసుకురావాలన్నారు.

బస్టాండ్‌లో ధరల బాదుడు

ఏది కొనాలన్నా ప్రయాణికుల జేబులకు చిల్లులే

- ప్రతి వస్తువుపై అదనపు ధరలు వసూలు
- ఎమ్మార్పీ నిబంధనలు పట్టించుకోని స్టాల్స్ నిర్వాహకులు
- స్టాల్స్ ముందు కానరాని ధరల పట్టిక
- తూతూ మంత్రంగా అధికారుల తనిఖీలు



విజయవాడ బస్ స్టేషన్

బస్టాండ్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలోనే అతి పెద్ద బస్టాండ్ అది. అక్కడ నుంచి రోజూ వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అలాంటి ప్రయాణ ప్రాంగణంలో ప్రయాణికుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. ఏది కొనాలన్నా ఆలోచించాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. అల్పాహారం నుంచి పిల్లల బిస్కెట్లు, చాక్లెట్లు, భోజనం వరకూ దేని ధరలు చూసినా బెదరాల్సిందే. ఇది ఎక్కడో కాదు మన విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్ స్టేషన్(పీఎన్‌బీఎస్)లోనే. పూర్తి వివరాలు ఇవి..

నిలువు దోపిడీ..

ప్రతి రోజు వేలాదిమంది ప్రయాణికులు రాకపోకలు సాగించే పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో అధిక ధరల విక్రయాలతో స్టాల్స్ నిర్వాహకులు ప్రయాణికులను నిలువునా దోచుకుంటున్నారు. బిస్కెట్ ప్యాకెట్ నుంచి బిర్యానీ వరకు స్టాల్స్ నిర్వాహకులు నిర్ణయించిన ధరకే ప్రయాణికులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంటోంది. బస్టాండ్‌లో ఎమ్మార్పీ ధరలకే వస్తువులు విక్రయించాలనే నిబంధన ఉన్నా, వాటిని అమలు చేయకుండా స్టాల్స్ నిర్వాహకులు ఒక్కో వస్తువుపై రూ. 5 నుంచి రూ. 10 వరకు అదనంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. అవకాశాన్ని బట్టి వారు అందినకాడికి అధిక ధరలకు విక్రయాలు చేసుకుంటూ ప్రయాణికుల నుంచి ప్రతిరోజు రూ. లక్షల్లో ఆదాయం సమకుర్చుకుంటున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో అయితే వీరి దందాకు అడ్డూ అదుపు లేకుండా పోతోందంటూ పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు అడపాదడపా కేసులు పెట్టి, పెనాల్టీ విధించి తమ పని అయిపోయింది అనిపించుకోవడంతో వ్యాపారులు యథేచ్ఛగా తమ దందాను కొనసాగిస్తున్నారు.

కనిపించని ధరల పట్టిక..

స్టాల్స్ ముందు ధరల పట్టిక ఉండాలనే నింబంధన ఉన్నప్పటికీ బస్‌స్టేషన్‌లో అది ఎక్కడ కనిపించడం లేదు. కొన్ని దుకాణాల ముందు ధరల పట్టిక ఉన్నా అది కనిపించకుండా దానికి అడ్డుగా డస్ట్‌బిన్‌లు పెట్టడం, ఫుడ్ ప్యాకెట్‌లను వేలాడదీసి ప్రయాణికులకు కనిపించకుండా చేస్తూ వారి జేబులకు చిల్లులు పెడుతున్నారు.

పెనాల్టీలు విధిస్తున్నా..

బస్‌స్టేషన్‌లో ప్రయాణికులు ఫిర్యాదు చేసినప్పుడు అధికారులు అప్పుడప్పుడు తనిఖీలు చేపడుతున్నారు. అధిక ధరలు విక్రయాలు చేసినా, నాసిరకం ఆహార ఉత్పత్తులు అమ్మినా ఆయా స్టాల్స్ నిర్వాహకులపై పెనాల్టీ విధిస్తున్నారు. అయినప్పటికీ వారిలో మార్పు రావటం లేదు. కారణం వారికి వచ్చే అదనపు ఆదాయంతో పోల్చుకుంటే చెల్లించే పెనాల్టీ ఒక లెక్కే కాదంటూ ప్రయాణికులు చెబుతున్నారు. తనిఖీ అధికారులు అటు వెళ్లగానే యథావిధిగా తమ దందా కొనసాగిస్తున్నారు. దీనిపై అధికారులు స్పందించి పెనాల్టీలతో సరిపెట్టకుండా కఠిన చర్యలు తీసుకుంటే తప్ప వ్యాపారుల్లో మార్పురాదని పలువురు ప్రయాణికులు చెబుతున్నారు.



పీఎన్‌బీఎస్ బస్ స్టాండ్‌లోని స్టాల్స్

ఎమ్మార్పీ ధరలు అమలు కావడం లేదు..



బస్‌స్టేషన్‌లో వాటర్ బాటిల్, కూల్‌డ్రింక్ కొంటే వాటిపై ఉన్న ఎమ్మార్పీ ధర కంటే అదనంగా ఐదు నుంచి పది రూపాయలు వసూలు చేశారు. అదేమని అడిగితే తగిన చిల్లర తెచ్చుకోవాలంటూ విసుక్కుంటూ.. డబ్బులకు బదులుగా బిస్కెట్ ప్యాకెట్‌ను చేతిలో పెట్టారు. దీనిపై అధికారులు నిరంతరం నిఘా పెట్టి ప్రయాణికులు నష్టపోకుండా చూడాలి.

– విజయలక్ష్మి, ప్రయాణికురాలు

కఠిన చర్యలు తీసుకుంటాం..

బస్టాండ్‌లోని దుకాణాల్లో అధిక ధరలు వస్తువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రయాణికుల నుంచి మూడు కంటే ఎక్కువ ఫిర్యాదులు వస్తే దుకాణాల లైసెన్స్ రద్దు చేస్తాం. నిబంధనల ప్రకారం ఎమ్మార్పీ ధరలకే వస్తువులు విక్రయించాలి.

– ఎం. శ్రీనివాసరావు, డెప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్, పీఎన్‌బీఎస్

విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

జిల్లా ఎంఎస్‌ఎంఈ కో–ఆర్డినేటర్ మాదగని గురునాథ్



మాట్లాడుతున్న గురునాథ్

పటమట(విజయవాడతూర్పు): జాబ్ మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా నైపుణ్యాలు విద్యార్థినులు కలిగి ఉంటే మరిన్ని మెరుగైన ఉపాధి ఉద్యోగ అవకాశాలు పొందుకోవచ్చని ఎన్టీఆర్ జిల్లా ఎంఎస్‌ఎంఈ కో–ఆర్డినేటర్ మాదగని గురునాథ్ అన్నారు. పటమటలోని స్టెల్లా కళాశాల్లో కృత్రిమ మేధ పవర్ అంశాలపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కృత్రిమ మేధలో శిక్షణ వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ తరహా శిక్షణ కార్యక్రమాలను ప్రభుత్వ కళాశాలల్లో కూడా అమలయ్యేలా తాము కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల డాక్టర్ జసింత క్వాడ్రస్, మార్పు ట్రస్ట్ డైరెక్టర్ సూయజ్, రిసోర్స్ పర్సన్ రామ్, అధ్యాపకులు డాక్టర్ భారతి, డిగ్రీ విద్యార్థులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి సుబ్బరాజు సేవలు అపూర్వం



సుబ్బరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ నగరాభివృద్ధికి మాజీ శాసనసభ్యుడు కాకర్లపూడి సుబ్బరాజు అందించిన సేవలు అపూర్వమని సీపీఐ నగర సమితి కార్యదర్శి జి. కోటేశ్వరరావు అన్నారు. సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో స్థానిక లెనిన్ భవన్ వద్ద సుబ్బరాజు వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యవక్తగా హాజరైన కోటేశ్వరరావు మాట్లాడుతూ కార్పొరేటర్‌గా, డెప్యూటీ మేయర్‌గా, ఫ్లోర్ లీడర్‌గా, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడిగా, సీపీఐ నగర కార్యదర్శిగా కాకర్లపూడి సుబ్బరాజు విజయవాడ నగర అభ్యున్నతికి కృషి చేశారని కొనియాడారు. నగరంలో కొండ ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పనకు, ఇళ్ల పట్టాలు ఇప్పించడంలో సుబ్బరాజు చేసిన సేవలు ఎప్పటికీ మరువలేమన్నారు. కార్యక్రమానికి నగర సహాయ కార్యదర్శులు నక్క వీరభద్రరావు అధ్యక్షత వహించగా, లంక దుర్గారావు వందన సమర్పణ చేశారు. కార్యదర్శివర్గ సభ్యులు మూలి సాంబశివరావు, పంచదార్ల దుర్గాంబ, తాడి పైడయ్య, కొట్టు రమణారావు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

భవానీపురం(విజయవాడపశ్చిమ): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండో రోజైన మంగళవారం కొత్తపేట అగ్నిమాపక అధికారి తలశిల శ్రీనివాసరావు నేతృత్వంలో జక్కంపూడి వైఎస్సార్ కాలనీ, పరిసర ప్రాంతాలు, బస్టాండ్, సాయిరామ్, సౌమ్య థియేటర్ల వద్ద ప్రజలకు అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనుకోకుండా అగ్నిప్రమాదం సంభవిస్తే దానిని అరికట్టే విధానాలను వివరించారు. జక్కంపూడి కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇళ్లల్లో గ్యాస్ స్టౌవ్ వల్ల జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అదే విధంగా ఎండాకాలంలో బహిరంగ ప్రదేశాల్లో మంటలు వచ్చినప్పుడు దగ్గరలో ఉన్న అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వాలని బస్టాండ్ వద్ద ఉన్న ప్రజలకు తెలిపారు. అనంతరం చిట్టినగర్‌లోని సౌమ్య, సాయిరామ్ థియేటర్లలో ఏర్పాటు చేసిన కార్బన్ డయాక్సైడ్ ఫైర్ ఎక్స్‌టింగ్విషర్స్, డ్రై కెమికల్ పౌడర్స్, ఫైర్ అలారం వంటి అగ్నిమాపక పరికరాలను ఏ విధంగా వినియోగించాలో అక్కడి సిబ్బందికి అవగాహన కల్పించారు.

ఘనంగా అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సుధాకర్. చిత్రంలో కామళ్ల జోజి తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): భారత రాజ్యాంగ రూపశిల్పి భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని 47వ డివిజన్ పరిధిలోని టేనర్‌పేటలోగల మాల కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని సీఐ మేదర సుధాకర్ ఆవిష్కరించారు. విగ్రహ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు కామళ్ల జోజి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఐ సుధాకర్ మాట్లాడుతూ అసమానతలు లేని సమసమాజం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు అంబేడ్కర్ మహాశయుడని అన్నారు. ఆయన రచించిన రాజ్యాంగం ద్వారానే బడుగు, బలహీనవర్గాల ప్రజలు నేడు స్వేచ్ఛగా జీవించగలుగుతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కామళ్ల భిక్షయలు, చెవుల దేవదాసు, బోయళ్ల కృష్ణ, చెవుల మరళి, కామళ్ల కిషోర్, సీహెచ్ శ్రీనివాస్ బాబు, పావులూరి శివాజీ, యరమాల ఆనంద్, బొప్పన రాంబాబు, వలతోటి జోషి, బోయళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్క్రీన్ ప్రింటింగ్ కోర్సులో ఉచిత శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): వేసవి సెలవుల సందర్భంగా విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు స్క్రీన్ ప్రింటింగ్ కోర్సులో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న యువతీ యువకులు, విద్యార్థులు, మహిళలు ఈ నెల 19వ తేదీలోగా విజయవాడ మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లో ఉన్న తమ సంస్థ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ నెల 19 తేదీ నుంచి తమ సంస్థ కార్యాలయం ఆవరణలోనే ఈ ఉచిత శిక్షణ తరగతులు జరుగుతాయని తెలిపారు. ఇతర వివరాలకు 0866-2470420లో సంప్రదించాల్సిందిగా కోరారు.

22 నుంచి యోగాలో ఉచిత శిక్షణ


మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): వేసవి సందర్భంగా ఈ నెల 22వ తేదీ నుంచి 45 రోజుల పాటు యోగాలో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని అమరావతి యోగా అండ్ ఏరోబిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ నాగేశ్వరరావు, కార్యదర్శి పీవీ రమణ ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని బందరురోడ్డులో ఉన్న ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియం ఆవరణలో తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి రోజు ఉదయం 5.45 నుంచి 6.45 గంటల వరకు, సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు యోగా గురువు అంకాల సత్యనారాయణ పర్యవేక్షణలో తరగతులు జరుగుతాయన్నారు. సూర్య నమస్కారాలు, యోగాసనాలు, ప్రాణాయామంలో శిక్షణ ఇస్తామని వివరించారు. ఆసక్తి ఉన్న వారు 22వ తేదీలోగా 90147 46719, 98487 32626లో పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు.

రేపు తాగునీటి సరఫరా నిలిపివేత

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థ పరిధిలోగల గవర్నర్‌పేట వద్ద ఉన్న 1137 కేఎల్ సామర్థ్యం గల తాగునీటి సరఫరా రిజర్వాయర్ – 2 అవుట్‌లెట్ వాల్వ్ మార్చనున్నందున ఈ నెల 17వ తేదీ సాయంత్రం తాగునీటి సరఫరా ఉండదని నగరపాలక సంస్థ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. సర్కిల్ – 3 పరిధిలోని 19వ డివిజన్ లబ్బీపేటలోని అమెరికన్ హాస్పిటల్ రోడ్, అన్నమయ్య రోడ్, పున్నమ్మతోట, ఆశ్రమం రోడ్, పోలీస్ క్వార్టర్స్ ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదు. అలాగే సర్కిల్ – 2 పరిధిలోని 23వ డివిజన్‌లోగల గవర్నర్‌పేట, సూర్యారావుపేట, 24వ డివిజన్‌లోని న్యూ గిరిపురం, కస్తూరిభాయిపేట, ప్రాంతాలవారికి నీటి సరఫరా ఉండదు. ఈ నెల 18వ తేదీ ఉదయం నుంచి యథావిధిగా నాటి సరఫరా జరుగుతుంది.

కాలయాపనతోనే సరి

బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుష్పరాజ్



సమావేశంలో మాట్లాడుతున్న పుష్పరాజ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర విభజన అనంతరం 2014లో అధికారం చేపట్టిన చంద్రబాబు ల్యాండ్ పూలింగ్ పేరుతో రాజధాని ప్రాంతంలో రైతుల నుంచి వేల ఎకరాలు తీసుకుని అయిదేళ్ల పాటు తాత్కాలిక సచివాలయం, హైకోర్టు పేరుతో కాలయాపన చేశారని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.పుష్పరాజ్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మంగళవారం మాట్లాడారు. ఆనాడు తమ నుంచి బలవంతంగా భూములు లాక్కొవద్దని పేద రైతులు వేడుకున్నా కనికరించలేదన్నారు. రైతులు ఇచ్చిన భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ.. కాలం వెళ్లదీశారని విమర్శించారు. రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేయకపోగా విస్తరణ అవకాశాల పేరుతో మరో 44,676 ఎకరాలను ల్యాండ్ పూలింగ్ లేదా నెగోషియేట్ సెటిల్మెంట్స్ లేదా భూసేకరణ చట్టం ద్వారా సమీకరించాలని టీడీపీ కూటమి సర్కారు ప్రకటన చేయడం సరికాదన్నారు. ఈ భూసేకరణ తంతు అంతా కేవలం కార్పొరేట్లకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు దోచి పెట్టాలనే ఉద్దేశంతోనే తప్ప మరొకటి కాదన్నారు. రాష్ట్ర కార్యదర్శి కొదమల ప్రభుదాసు, ఉదయ్ కిరణ్, వైస్ ప్రెసిడెంట్ శామ్యూల్ కుమార్, రత్నం పాల్గొన్నారు.

మైనార్టీలపై చిత్తశుద్ధిని నిరూపించిన వైఎస్సార్ సీపీ

వక్ఫ్‌బిల్లుపై సుప్రీంకోర్టులో పిటిషన్ వేయటంపై షేక్ ఆసిఫ్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మైనార్టీలు, వారి హక్కుల పట్ల చిత్తశుద్ధి ఉన్న ఏకైక పార్టీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఆసిఫ్ అన్నారు. అందువల్లే రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్న వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుపై తమ పార్టీ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిందని ఆయన పేర్కొన్నారు. ఆసిఫ్ తన కార్యాలయంలో మంగళవారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టం–2025 ముస్లిం ధార్మిక సంస్థల వ్యవహారాల్లో జోక్యం చేసుకునే విధంగా, మత విశ్వాసాలకు విరుద్ధంగా, మైనారిటీల హక్కులకు భంగం కలిగించే విధంగా ఉందన్నారు. కొన్ని శతాబ్దాలుగా అనేక మసీదులు, ముస్లిం శ్మశాన వాటికలు, దర్గాలు, ముస్లిం మత ప్రదేశాలన్నీ కూడా ఎలాంటి డీడ్స్ లేకపోయినా, వక్ఫ్ బోర్డుల పరిధిలో కొనసాగుతూ, వక్ఫ్ ఆస్తులుగా కొనసాగుతున్నాయన్నారు. కానీ ఇప్పుడు తీసుకొచ్చిన సవరణ చట్టం, వాటన్నింటిపై బోర్డుకు ఇప్పటి వరకు ఉన్న హక్కును తొలగిస్తుందన్నారు. దేశ రాజ్యాంగం కల్పిస్తున్న మతపరమైన స్వేచ్ఛ, మైనారిటీల హక్కులు, ఆస్తుల పరిరక్షణకు సంబంధించి రాజ్యాంగం కల్పిస్తున్న హక్కులకు ఈ చట్టం కచ్చితంగా భంగం కలిగిస్తుందని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మైనార్టీల హక్కులకు అండగా అడుగులు వేస్తున్నారని కొనియాడారు.

మాజీ సీఎం జగన్‌కు ధన్యవాదాలు

వించిపేట(విజయవాడపశ్చిమ): వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ముస్లిం మైనార్టీలు చేస్తున్న ఆందోళనలకు మద్దతుగా ఈ చట్టంపై సుప్రీం కోర్టులో న్యాయపోరాటానికి దిగిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ నాయకుడు, జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్ ధన్యవాదాలు తెలిపారు. వించిపేట, నైజాంగేటుసెంటర్‌లోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వక్ఫ్ వ్యవస్థను నాశనం చేస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంట్ ఉభయ సభలలో వైఎస్సార్ సీపీ వ్యతిరేకించిందని గుర్తుచేశారు. నేడు రాష్ట్రంలో ముస్లిం మైనారిటీల ఆవేదన దృష్ట్యా వక్ఫ్ కొత్త చట్టానికి వ్యతిరేకంగా రాజ్యాంగంలోని 14, 15 ఉల్లంఘనలను ఉటంకిస్తూ సుప్రీం కోర్టులో కేసు వేశారని చెప్పారు.

విద్యార్థులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బహూకరణ



దాత బహూకరించిన ఐఎఫ్‌పీతో అతిథులు, విద్యార్థులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమీ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులకు ఓ దాత ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పీ) బహూకరించారు. మంగళవారం హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారి ఎ. కిరణ్ కుమార్ తన తల్లి కమలమ్మ జ్ఞాపకార్థం ఐఎఫ్‌పీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులను ప్రోత్సహించటం సామాజిక బాధ్యతగా భావించి వివిధ రూపాలలో వారికి చేయూత ఇస్తున్నామని తెలిపారు. కేజేఎస్ ప్రకాశరావు, ఎస్‌బీఐ అధికారులు వి. విజయ్ శేఖర్, కె. సతీష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తరుణ్ బాబు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కందుకూరి విశిష్ట పురస్కారానికి శామనపూడి ఎంపిక



డాక్టర్ శామనపూడి వెంకటేశ్వరరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని పురస్కరించుకుని ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం కళాకారులకు ఇచ్చే శ్రీ కందుకూరి విశిష్ట పురస్కారానికి ఎన్టీఆర్ జిల్లా నుంచి డాక్టర్ శామనపూడి వెంకటేశ్వరరావు ఎంపికయ్యారని పాతబస్తీలోని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కంచర్ల శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 16న తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే అవార్డుల ప్రదాన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా వెంకటేశ్వరరావు పురస్కారాన్ని అందుకోనున్నారని తెలిపారు. డాక్టర్ శామనపూడి వెంకటేశ్వరరావు తమ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తుండటం తమకు గర్వకారణమని పేర్కొన్నారు. నాటక రంగంలో చంద్రమతి, చింతామణి మహిళల పాత్రలు, అలాగే హరిశ్చంద్రుడు, నక్షత్రకుడు పాత్రలకు వెంకటేశ్వరరావు పెట్టింది పేరు అని తెలిపారు. గతంలో పరిషత్ నాటకాలలో నంది అవార్డులు కూడా అందుకున్నారని వివరించారు.

మత విద్వేషాలు రెచ్చగొట్టేలా కేంద్రం పాలన

ఐద్వా జిల్లా కార్యదర్శి శ్రీదేవి



మేకలవారివీధిలో ప్రజా చైతన్య యాత్రలో మాట్లాడుతున్న ఐద్వా ఆదిలక్ష్మి

వించిపేట(విజయవాడపశ్చిమ): అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) పశ్చిమ కమిటి కార్యదర్శి గాదే ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గంలోని 50వ డివిజన్, మేకలవారి వీధిలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఐద్వా జిల్లా కార్యదర్శి శ్రీదేవి పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా.. సమాజంలో కుల, మత, సామాజిక భేదాలు నానాటికీ పెరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే హిందూ, ముస్లిం, క్రిస్టియన్ అనే భేదాలను చూపిస్తూ వారి స్థలాలను వక్ఫ్ బోర్డు సవరణ చట్టాల పేరుతో పాలకులు కబ్జా చేయాలనే కుట్రలు జరుగుతున్నాయని అన్నారు. నేడు ప్రజలందరూ ఆరోగ్యం, విద్య కోసం అనేక మోతాదుల్లో డబ్బులు ప్రభుత్వానికి చెల్లిస్తున్నారని, జనరల్ సర్వీస్ టాక్స్, జీఎస్టీ పేరుతో ప్రజల్ని అనేక రకాలుగా కేంద్ర ప్రభుత్వం దోపిడీ చేస్తోందని దుయ్యబట్టారు.

నేటి నుంచి 44వ జాతీయ స్థాయి నాటికల పోటీలు

విజయవాడ కల్చరల్: పీఎంకే ఫైన్ ఆర్ట్స్, ఆంధ్రప్రదేశ్ చలన చిత్ర వాణిజ్యమండలి ఆధ్వర్యంలో 16వ తేదీ నుంచి అయిదు రోజులపాటు 44వ జాతీయ స్థాయి సాంఘిక నాటికల పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు పసుపులేటి వెంకరమణ మంగళవారం తెలిపారు. గాంధీనగర్‌లోని కందుకూరి కల్యాణ మండపంలో సాయంత్రం 6 గంటల నుంచి కార్యక్రమాలు ఉంటాయన్నారు. 16వ తేదీ విముక్తి, ద్వార బంధాల చంద్రయ్య నాయుడు, మరీ అంత వద్దు.. 17వ తేదీ దేవరాగం, మనసాక్షి, మోచేతి కంకణాలు.. 18వ తేదీ చీమ చీమ ఎందుకు కుట్టావ్, అమ్మ చెక్కిన బొమ్మ నాటకాలు ఉంటాయని తెలిపారు. 19వ తేదీన జానపద కళారూపాలు, 20న సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.